

# బేతాళ జానపద కథలు



# గుణవంతుడి మొక్క

శ్రీదేవి మురళీధర్

*బాల బండారం (బేతాళ కథ)*

# గరుత్మంతుడి ముక్కు

శ్రీదేవీ మురళీధర్

పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు తిరిగివెళ్ళి చెట్టుపైనుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానం కేసి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు "రాజా, విధిని ఎవరూ వంచించలేరు. విధివిలాసానికి అందరూ తలొగ్గాల్సిందే నని నీవంటి శూరునికీ, జ్ఞానికీ బాగా తెలుసు. నీవు పడుతున్న ఇక్కట్లు చూస్తుంటే జాలి కలుగుతోంది. ఐనా రాసిపెట్టి ఉన్నన్నాళ్ళూ అనుభవించక తప్పదులే. చిరంజీవి అయిన వంశపురుషుడి దీవెనలు, మార్గ దర్శకత్వమూ ఉండి కూడా రత్నమేరు అనే ఒక గొప్ప రాజు పుత్రవియోగం తప్పలేదు. ఆ పుత్రుడికి పేదరికం, అనామకత్వమూ తప్పలేదు. శ్రమ తెలియకుండా ఆ కథ చెబుతాను విను" అంటూ ఇలా చెప్పసాగాడు.

పూర్వం రత్నమేరు అనే రాజు ఉండేవాడు. ఆయన ఒక్కగానొక్క కొడుకు స్వర్ణమేరుని ఏడాది వయసులో శత్రువులు ఎత్తుకుపోయారు. ఆ తర్వాత ఆయనకు మరి సంతానం కలుగలేదు. అలా పదిహేనేళ్ళు గడిచేసరికి తనకి వారసులు లేరన్న దిగులు పట్టుకుని కృశించి పోసాగాడు. రాజవైద్యులు చికిత్స చేస్తున్నారు కానీ మనోవ్యాధికి మందు లేదు కదా! అలాంటి సమయంలో ఆయనకు ఒక రాత్రి నిద్రలో ఓ కల వచ్చింది. ఆ కలలో ఓ ముసలి సాధువు కనిపించి, "నాయనా, రత్నమేరూ! దిగులు పడకు. పూర్వజన్మలో నీవు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తంగా నీకు పుత్ర వియోగం కలిగింది. ఈ జన్మలో మహారాజుగా ప్రజల కెంతో మేలు చేసిన పుణ్యంవల్ల నీ కొడుకు శత్రువుల బారినుంచి కాపాడబడి వేరే పేరుతో నీ వంశవృక్షం నీడలో సురక్షితంగా ఉన్నాడు. ఆ నీడలో మైమరచి నప్పుడు మాత్రమే సకల జీవ సమ్మోహనంగా వేణు గానం చేస్తాడు. అతడి ఇప్పటి పేరు అర్థంకూడా నువ్వు పెట్టుకున్న పేరుకి దగ్గర్లో ఉంటుంది. 'ఎవరైతే గరుత్మంతుడి ముక్కు చెంతనున్న మాణిక్యాన్ని తెచ్చిస్తారో వారికి వెలలేని కానుకలూ, అగ్రహారాలూ బహూకరించి రాచమర్యాదలు చేస్తానని– రేపు నువ్వు– రాజ్యంలో దండోరా వేయించు. ఏడాదిలోగా నీ కొడుకు తిరిగి రాగలడని నాదీ హామీ" అన్నాడు.

మర్నాడు రాజు కలలో సాధువు చెప్పినట్లే రాజ్యంలో దండోరా వేయించాడు. ప్రజలది విని, 'విష్ణుమూర్తికి సాక్షాత్తూ వాహనమైన గరుత్మంతుణ్ణి సామాన్యులు కలుసుకోగలరా? కలిసినా ఆయన తన ముక్కు దగ్గర చెయ్యి పెట్టనిస్తాడా? పెట్టనిచ్చినా అక్కడ మాణిక్యం ఉంటుందా? ఉన్నా ఆయన దాన్ని తీసుకోనిస్తాడా?' అనుకుని ఉపేక్షాభావంతో ఊరుకున్నారు.

ఆ రాజ్యంలో ఒక ఊళ్లో పసిడికొండ అనే పదహారేళ్ళ

కుర్రవాడున్నాడు. వాడికి అమ్మా నాన్నా లేరు. పుట్టి బుద్ధెరిగినప్పటినుంచీ, ఎదురుగా కనబడి, కంటికి రెప్పలా తనను పెంచిన ముసలి జంటనే 'అమ్మా, అయ్యా' అని పిలుస్తాడు. వాడికి ఏ విషయంలోనైనా కొన్నాళ్లే ఆసక్తి. వడ్రంగంలో పెడితే వారంలోగా అన్నీ నేర్చుకుని 'ఇంక నేర్చుకునేందుకేమున్నది?' అని మానేశాడు. కంసాలి వద్ద పనికి కుదిరిస్తే పదిరోజులలో అతడు నేర్పగలిగినదంతా నేర్చుకుని ఇంక చాలన్నాడు. కుమ్మరిదాసు శిష్యుడిగా చేరి కుమ్మరం విద్యను ఆరు రోజులులోగా ఔపోశన పట్టాడు. నేత మగ్గాల దగ్గర కూర్చుని, రాణీగారికి పంపదగ్గ తివాచీని– పక్షం రోజులలో మగ్గం మీద నేసి పంపాడు. దేనిలోనూ నిలకడగా శ్రద్ధ పెట్టకపోతేనేం– రాలుగాయిలా వీధులవెంట తిరిగే రకంకాదని అమ్మా, అయ్యా వాడినేమీ అనేవారు కారు. మరొకరిని అననిచ్చేవారు కారు. వాడిది అతి సూక్ష్మబుద్ధి అనీ, అందచందాలలో పున్నమిచంద్రుడనీ మురిసిపోతూంటారు వాళ్లు.

ఊరిచివర కొండవాలుపై ఉన్న ఓ మహావృక్షం బోదెమీద కాళ్లు చాపి పడుకుని, ఆకాశం వంక చూస్తూ, ప్రకృతిలో లీనమై, తన పిల్లంగోవిని మధురంగా వాయిస్తూ, మధ్యమధ్యన శ్రావ్యమైన కంఠంతో జానపద గీతాలు పాడుతూ ఉంటాడు పసిడికొండ. వాడి వేణు నాదం, పాట ఆ చుట్టుపక్కల బాటసారులందరికీ పరిచితమే. వాడికి ఆకలివేస్తే ఏ దుంపో, కాయో తిని సెలయేటి వద్ద కడుపునిండా నీళ్ళుతాగుతాడు. వన్యమృగాలేవీ వాడి జోలికి రావు. సంగీతంలో మైమరచి ఉండే ఈ చక్కటి కుర్రాడు ప్రకృతిలో ఒక భాగమే కానీ ప్రమాదకరమైన మనిషి కాదు మరి!

అలాంటి పసిడికొండ రాజుగారి దండోరా విన్నాడు. విని కొండవాలులోని మహావృక్షం బోదెపై జారగిలపడి చెరుకుగడ నములుతూ– ఆ విషయమై రోజుల తరబడి ఆలోచించాడు. వాడి మనసులో ఏ ఆలోచన వచ్చిందో కానీ ఇంటికి చేరి తనకున్న రెండు చొక్కాయిలు, పంచెలు, తలగుడ్డలు వాటితోపాటు తన పిల్లంగోవి, మరికొన్ని పనికొచ్చే వస్తువులు కలిపి ఒక అంగవస్త్రంలో పొందికైన మూటగా కట్టుకున్నాడు. రాములవారి గుడికి వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఇదంతా చూచి బెంబేలెత్తిన అమ్మ, అయ్యలు– "ఎక్కడికిరా బాబూ ప్రయాణం! నువ్వు లేకుండా మేం బ్రతకలేమని తెలుసుగా' అంటూ గోల పెట్టారు. వాడు వారికి చిరునవ్వే ఓదార్పుగా ఇచ్చి, ఎవరికీ ఏ మాటా చెప్పకుండా ముందుకు నడిచాడు.

బయలుదేరడమైతే బయలుదేరాడు కానీ ఎటు వెళ్ళాలి, ఎలా సాధించాలి అన్నది వాడికి అంతు పట్టలేదు. 'వెదకటం మొదలుపెడితే ఎక్కడో అక్కడ తేలుతాను' అనుకుని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని కాలినడకన ఎన్నో ఊళ్ళు తిరిగాడు. ఏనాడూ ఊరు దాటని వాడికిప్పుడు ప్రపంచం అవగతం కాసాగింది.

లోకంలో రకరకాల మనుషుల్ని చూచాడు. వివిధ మనస్తత్వాలు తెలుసుకున్నాడు. పట్టణాల నాగరికత, వన్నెచిన్నెలు, నాగరికుల కపటత్వం అర్థం చేసుకున్నాడు. రైతులు, ఉద్యోగులు, వర్తకులు వగైరా వివిధ వృత్తులవారి తీరుతెన్నులు గమనించాడు. పూటకూళ్లమ్మలు, బైరాగులు, పేదరాసి పెద్దమ్మలు చెప్పే

విశేషాలెన్నో విన్నాడు. 'ఇదా ప్రపంచం!' అనుకున్నాడు.

పసిడికొండ కథ విన్నవారు, "దండోరా మేమూ విన్నాం. కానీ ఇలా ఏదో సాధిద్దామని దేశంమీదకు బయలుదేరిన వాడిని నిన్నొక్కడినే చూస్తున్నాం' అన్నారు.

వాడు ఏ తల్లయినా దయతలచి ఇంత అన్నం పెడితే తినేవాడు. లేనినాడు కడుపునిండా నీళ్లు త్రాగి పడుకునే వాడు. ఎక్కడా వాడికి 'గరుత్మంతుడి ముక్కు' గురించి మాత్రం తెలియరాలేదు. అలా ఏడాది కావచ్చేసరికి వాడు దేశం నలుమూలలూ చుట్టి మళ్లీ తన ఊరి పొలిమేరకు చేరాడు. అక్కడ అలసి సొలసి, తోపులోని ఓ రావిచెట్టు నీడన, చేతిసంచీ తలక్రింద పెట్టుకుని విశ్రమించాడు. అప్పుడు వాడికి తనమీదే ప్రాణాలు పెట్టుకున్న అమ్మ, అయ్య గుర్తొచ్చి, 'ఎలా ఉన్నారో' అనుకున్నాడు దిగులుగా. అంతలో సన్నగా కునుకు పట్టింది.

అలా ఎంతసేపు నిద్రపోయాడో కానీ, "అబ్బ, ఎంత నడిపించావురా. నీ కోసం చాలా దూరం నుండి వచ్చా, లేరా పసిడికొండా, లేలే' అంటూ ఎవరో తట్టి లేపి నట్లయి తటాలున లేచాడు పసిడికొండ. కళ్లు తెరిచి చూస్తే– తెల్లని వస్త్రాలు కట్టుకుని, పొడవాటి వెండిజుట్టు విరబోసుకుని, తెల్లని గడ్డంతో ఒక సాధువు కనిపించాడు.

"ఈయనెవరు చెప్మా? ఎప్పుడూ చూసినట్లు లేదు, పైగా పేరుపెట్టి మరీ పిలుస్తున్నాడే" అని ఆశ్చర్య పడుతూనే– వాడాయన ముఖతేజస్సుకి అబ్బురపడి అప్రయత్నంగా ఆయన కాళ్ళకు నమస్కరించాడు.

ఆయన వాణ్ణి దీవించి, కాళ్లు లాగేస్తున్నాయంటూ దగ్గరగా ఉన్న ఎత్తయిన కొండరాయి మీద అలసటగా చతికిలబడ్డాడు. పసిడికొండ ఆయన పాదాలవద్ద కూర్చుని ఆయన కాళ్ళను తన ఒడిలో ఉంచుకుని మృదువుగా వత్తసాగాడు. సాధువుకి హాయిగా ఉన్నట్లుంది. పరవశంతో కళ్ళుమూసుకున్నాడు. అలా కాసేపయ్యాక కళ్ళు తెరిచి, 'ఇక చాల్లే, ఆపు' అన్నాడు.

ఆ సాధువుని అమ్మ, అయ్య కానీ పంపలేదు కదా అని అప్పుడు పసిడికొండకి అనుమానమొచ్చింది. "స్వామీ, మీకు నా పేరెలా తెలిసింది?" అన్నాడు.

'నీ పేరు నాకేం తెలుసు? బంగారుకొండలా ఉన్నావని పసిడికొండా అని పిలిచా, అంతే. అయితే నీపేరూ అదేనా?' అన్నాడు సాధువు ఎరుగనట్లు. వాడు ఊఁ అన్నట్లు తల పంకించగానే, "ఎలా జరిగింది దేశాటన? ఏమేమి సాధించుకొచ్చావు, కాస్తచెబుదూ" అంటూ ప్రేమగా వాడి తల నిమిరాడు సాధువు.

"బాగానే జరిగింది స్వామీ. దేశమంతా కలయదిరిగి వింతా, విడ్డూరం అన్నీ చూసుకువచ్చాను" అన్నాడు పసిడికొండ. సాధువు నవ్వి, "సరే కానీ అసలు పని ఏమయింది?" అన్నాడు.

పసిడికొండ ఆశ్చర్యంగా, "నేనెవరో తెలియక పోయినా, నా ప్రయాణం ఉద్దేశ్యం ఈయనకి తెలుసా?" అనుకున్నాడు. ఐనా ఆ మాట ఆయనచేతే చెప్పిద్దామని, "అసలు పని అంటే?" అన్నాడు.

"రాజుగారి దండోరా వినంగానే మూటాముల్లే సర్దుకొని దేశంమీద పడ్డ నీ సంగతి అందరికీ తెలుసురా వెర్రివాడా! ఇంతకీ దొరికిందా ఆ గరుత్మంతుడి ముక్కు?" అంటూ సాధువు వాడి బుగ్గలు పుణికాడు.

దానికి వాడు బాధగా తలవంచుకోవడం చూసి, "ఈ మాత్రానికే బెంబేలు పడిపోతే ఎలాగురా అబ్బీ. పోనీలే. ఈ రూపేణా తెలివికల కుర్రాడివి దేశం చూచి, లోకజ్ఞానం సంపాదించుకొచ్చావు, అవునా?" అన్నాడు.

ఔనన్నట్లు తల ఊపాడు పసిడికొండ. అప్పుడు సాధువు నవ్వి, "అయితే గరుత్మంతుడి ముక్కు ఎక్కడుందో నేను చెప్పనా?" అన్నాడు.

పసిడికొండ కళ్ళు జిగేలుమని మెరిశాయి. అంతలోనే ఏదో స్ఫురించి, "ఆగండాగండి స్వామీ. నాతో చెప్పటమెందుకు? నిజంగానే మీకు తెలిస్తే ఆ మాణిక్యమేదో మీరే సాధించి రాచమర్యాదలు పొందవచ్చును కదా!" అన్నాడు.

సాధువు నవ్వి, "ఔనుసుమీ! నాకిది తట్టనే లేదు. నువ్వు చెప్పినట్లే చేస్తాను కానీ- ఇన్నాళ్లు దేశాలు పట్టి తిరిగావు. నీకా గరుత్మంతుడి ముక్కు చూడాలని లేదూ?" అంటూ సాధువు వాడికి తనని అనుసరించమని సైగ చేసి కాస్త ముందుకు వెళ్లి ఆగాడు. కాస్త దూరంలో కొండవాలులో మహావృక్షం ఒకటి ఉంది.

అది వందల సంవత్సరాల చరిత్రగల వృక్షం. పసిడికొండ దానికి జారిగిలబడి పిల్లంగోవి ఊదుతూ గానం చేసేవాడు. ఆ చెట్టునీ, పరిసరాల్నీ- కోల్పోయిన చెలికాడిని తిరిగి పొందినంత సంబరంగా చూచాడు వాడు. 'ఎన్నాళ్ళయింది- ఈ చెట్టుచెంత పడుకుని పిల్లంగోవి వాయించి?' అనుకుంటూ, వాడు పరుగున చెట్టువద్దకు వెళ్లి గబగబా తన మూటలోంచి పిల్లంగోవిని తీసి చెట్టు బోదెపై చేరి మైమరచి వేణుగానం చేశాడు. అది కొండకోనల్లో ప్రతిధ్వనించింది.

దూరంగానే ఉన్న సాధువు చప్పట్లు కొట్టి వాణ్ణీలోకంలోకి తీసుకొచ్చాడు. వాడు తనని చూడగానే తన వద్దకు రమ్మని సైగ చేశాడు. వాడు రాగానే, "ఇప్పుడు చూడు" అంటూ ఆ వృక్షాన్ని దూరంనుండి చూపించాడు.

"ఏముంది స్వామీ, అది తాతలనాటి చెట్టు. నాకేం కొత్తకాదు కదా చూడటానికి" అంటూనే చెట్టు కేసి చూసి నివ్వెరపోయాడు పసిడికొండ. ఆ చెట్టు ఒక పెద్ద గద్ద ఆకృతిలో ఉన్నది. శాఖలూ, ఆకులూ దట్టంగా ఉన్నతంగా విస్తరించి గరుత్మంతుడిలా గోచరించింది. బోదె భాగం వద్ద కొనదేలిన గద్ద ముక్కులా ఉంది. నిజానికి ఆ చెట్టు ఎప్పుడూ అలాగే ఉన్నా ఈ భావం మాత్రం ఆ క్షణమే కలిగింది పసిడికొండకు.

"ఒరే అబ్బీ, గరుత్మంతుడి ముక్కు దొరికింది కదా, మరి మాణిక్యమేదీ?" అన్నాడు సాధువు.

ఇంకా విస్మయం నుండి తేరుకోని పసిడికొండ, "నాకెలా తెలుస్తుంది?" అన్నాడు.

సాధువు పకపకా నవ్వి, "నువ్వేరా ఆ మాణిక్యానివి. నిన్ను తీసుకుపోయి రాజుగారికి అప్పగిస్తే ఆయన నాకు రాచమర్యాదలు చేస్తాడు. ఏం పోదాం వస్తావా?" అని సాధువు వాడి భుజం తట్టాడు.

అప్పటికి పసిడికొండకి అసలు విషయం అర్థమై, "రాజు నాకోసం దండోరా వేయించాడంటే ఒక పక్క భయంగా ఉంది. అయినా నన్ను మీరు మాణిక్యం అన్నారు కాబట్టి ఆయనది మంచి ఉద్దేశ్యమే కావచ్చని ఇంకో పక్క ధైర్యమూ కలుగుతున్నది. ఏదేమైనా నా కారణంగా మీకు రాచమర్యాదలు జరుగుతాయంటే నేను మీతో తప్పక వస్తాను, పదండి' అన్నాడు వాడు.

ఇద్దరూ రాజధాని చేరారు. రాజుగారి దండోరా విని, గరుత్మంతుడి ముక్కు చెంతఉన్న మాణిక్యాన్ని సాధించు కొచ్చానని సాధువు చెప్పగానే వారికి క్షణాలమీద రాజదర్శనమైంది. సాధువు రాజుని చూస్తూనే హుందాగా నవ్వి, "రత్నమేరూ– నీవు కోరిన వెలలేని మాణిక్యం. అంటే తప్పిపోయిన నీ తనయుడు వీడే. సందేహంలేకుండా స్వీకరించు. ఇతడు పశు పక్ష్యాదులను సైతం సమ్మోహనపరిచే విధంగా వేణువు ఊదటం నేను చెవులారా విన్నాను. వింటానంటే చెప్పు, ఇప్పుడే నీ సమక్షంలోనే వేణుగానం చేస్తాడు" అన్నాడు.

దీనికి పసిడికొండ కంగారుపడి, "స్వామీ! ఆ మహావృక్షం బోదెపై కూర్చున్నప్పుడే నా పిల్లంగోవి పలుకుతుంది. ఎన్నిసార్లు ప్రయత్నించినా వేరెక్కడా వాయించలేకపోయాను. క్షమించండి!" అన్నాడు.

రత్నమేరు క్షణంలో సింహాసనం దిగి పరుగున వచ్చి పసిడికొండని గాఢంగా ఆలింగనం చేసుకుని, "ఆ మహావృక్షం మన వంశవృక్షం. దానికీ నీకూ ఉన్న అనుబంధం నీ వారసత్వానికి నిదర్శనం. నేను నీకు పెట్టిన పేరు స్వర్ణమేరు. మరి నిన్ను పెంచిన పుణ్యమూర్తులు నీకు పెట్టిన పేరు, ఆ పేరుకి దగ్గర్లో ఏ బంగారు పర్వతమో అయుండాలి. ఔనా?" అన్నాడు.

"బంగారు పర్వతం కాదు కానీ, నా పేరు పసిడి కొండ" అన్నాడు పసిడికొండ వెంటనే.

'నా బంగారుతండ్రీ, నూటికి నూరుపాళ్ళూ నువ్వే నా వంశోద్ధారకుడు స్వర్ణమేరువి. ఆహా విధివిలాసం! నాకిప్పుడు అన్ని సందేహాలూ పటాపంచలైనవి. ఇక బాధ్యతలూ, బరువులూ నీకప్పగించి నేను నిశ్చింతగా వానప్రస్థం స్వీకరిస్తాను. ఏమంటారు సాధుపుంగవా?" అని అటు చూస్తే సాధువు కనిపించలేదు.

"అయ్యో– ఆ మహాపురుషుడు ఏమైనట్లు? ఆయనే నాకు గరుత్మంతుడి ముక్కు చూపించాడు. ఆయనే నన్ను మాణిక్యంగా గుర్తించాడు. ఆయన్ని రాచమర్యాదలతో సత్కరించాలి" అని పసిడికొండ కలవరపడ్డాడు.

రత్నమేరు కూడా చుట్టూ చూసి సాధువు కనబడకపోగా కలవరపడి, ఆయన్ను వెదకమని భటుల్ని నలుదెసలా పంపించాడు. సాధువు కనపడలేదు. ఆ రాత్రి నిద్రపోయాక రత్నమేరుకి కలలో ఆ సాధువు కనిపించి, "నాయనా, రత్నమేరూ! నేను మన వంశానికి మూలపురుషుడు వజ్రమేరుణ్ణి. నా వయస్సు వందల సంవత్సరాలు. యోగసిద్ధి పొంది ఇంకా చిరంజీవిగానే ఉన్నాను. మన వంశక్షేమం నా ధ్యేయం. అందుకే ఏడాదిక్రితం నీకు కలలో కనిపించి దండోరా వేయించ మని చెప్పాను. సమయం చూసి నీకు నీ కుమారుణ్ణి అప్పజెప్పాను. నువ్వు నన్ను గుర్తు పట్టకూడదన్నది దైవసంకల్పం. ఎందుకంటే రాజరికానికి వారసత్వం మంచిదే. కానీ వారసులు స్వయంప్రతిభతో ప్రజల మన్ననలు పొందాలి తప్ప– పూర్వీకుల పేరిట గౌరవం ఆశించకూడదు. అందుకే నేను వచ్చిన పని ఐపోగానే మాయమైపోయాను" అని చెప్పాడు.

రత్నమేరు ఎంతో సంతోషించాడు. మర్నాడు నిద్ర లేస్తూనే ఆయన– పసిడికొండను పెంచినవారిని పిలిపించి వారిద్దరికీ సమస్త మర్యాదలూ చేసి అగ్రహారాలు చదివించాడు.

పసిడికొండ పెరిగిన ఊరు స్వర్ణమేరుపురం.

అయింది. అక్కడి కొండవాలులోని మహావృక్షాన్ని నేటికీ అందరూ ప్రముఖ యాత్రాస్థలంగా దర్శిస్తూ– 'గరుత్మంతుడి ముక్కు' అని అబ్బురంగా చెప్పుకుంటారు.

బేతాళుడు కథ చెప్పటం ఆపి "వంశపురుషుడైన వజ్రమేరు సర్వశక్తిమంతుడు కదా! మరి తన వంశజులైన తండ్రీ కొడుకుల్ని తనే కలపొచ్చుగా. కలలో కనపడి దండోరా వెయ్యమనడమెందుకు? వేశాక ఏడాది దాకా ఆగడమెందుకు? పసిడికొండ దేశాటన అయ్యేదాకా ఆగి అప్పుడు వృక్షపు ఆకారాన్ని చూపి రత్నమేరు దండోరా అర్థాన్ని తెలిపి తండ్రి వద్దకు తీసుకుని వెళ్లడమెందుకు? ఇంత కథ నడపటం మూర్ఖత్వం కాదా? నాకు కలిగిన ఈ సందేహం నివృత్తి చెయ్యకపోతే నీ తల వెయ్యి చెక్కలైపోతుంది" అన్నాడు.

దీనికి విక్రమార్కుడు, "పూర్వజన్మ పాపంవల్ల రత్నమేరుకి పుత్రవియోగం కలిగింది. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం జరిగేదాకా తండ్రీ కొడుకుల సమాగమం జరుగదని వజ్రమేరు ముందే చెప్పాడు. రాజరికంలో వారసులు తమకు తాముగా ప్రతిభ చూపాలనే గొప్ప సంప్రదాయం ఆయనది. అలాగే కాబోయే రాజుని కనిపెట్టి రాచమర్యాదలందుకునే అవకాశం కూడా ఆ దేశ పౌరులకివ్వాలని ఆయన అనుకున్నాడు. అందుకే రత్నమేరుకి కలలో కనబడి దండోరా వేయించమని చెప్పాడు. కానీ ప్రజలా అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయారు. వారసుడైన పసిడికొండలో మాత్రమే రాజుగారి దండోరా ఉత్సుకతనూ, సాహసాన్నీ తట్టిలేపింది. కానీ అతడికి తెలివి, సామర్థ్యం ఉన్నా ఊరు దాటి ఎరుగని అమాయక బాలుడతడు. ఎన్నో వృత్తివిద్యలు క్షుణ్ణంగా వచ్చినా అవేవీ అతడి మనసును చూరగొనలేదు. ఎందుకంటే రాజ్యపాలనకు అర్హుడైనవాడు వృత్తివిద్యలతో ఆగిపోడు కదా. రాజరికపు వారసత్వం ప్రోత్సహించడంతో– తనకు తగినదింకేదో ఉన్నదనిపించి– అమాయకత్వాన్ని పాము కుబుసంలా విడిచిపెట్టి– ఏడాదిపాటు దేశాటన చేసి ప్రపంచాన్ని ఆకళింపు చేసుకున్నాడు. తగిన లోకజ్ఞానం సంపాదించాడు. వ్యక్తుడై వెనుదిరిగి వచ్చాడు. అలా వజ్రమేరు తన వంశజుణ్ణి దేశపాలనకు సిద్ధం చేశాడు. అత్యంత సామాన్య జీవితం గడిపిన పసిడికొండ ప్రజారంజకుడైన రాజుగా రాణించడానికా ఏడాది దేశాటనా గట్టి పునాది. సామాన్యుల జీవనం, కష్టనష్టాలు, నాగరీకుల మోసాలు, దురాగతాలు అన్నీ కళ్లారా చూసిన అనుభవం కాబోయే రాజుకి గొప్ప శిక్షణ. అలా పసిడికొండ పదిహేడేళ్ళదాకా అనామకంగా అనుభవించిన కష్టనష్టాల వెనుక ఒక బృహత్కార్యానికి సంబంధించిన దైవరహస్యం ఉన్నది' అన్నాడు.

రాజుకు ఈ విధంగా మౌనభంగం కలగగానే బేతాళుడు శవంతో సహా మాయమై తిరిగి చెట్టెక్కాడు.

---0---